

## ఎలిగేడులో జెడ్పీ సీఈవో పర్యటన

ఎలిగేడు: జెడ్పీ సీఈవో నరేందర్ వివిధ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఓటరు జాబితా తయారీపై సమీక్షించారు.



## 'కాపుల' ఐక్యత చాటుదాం

పెద్దపల్లిరూరల్: మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పురుషోత్తంరావు కోరారు. జిల్లా కేంద్రంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు.

గరిష్టం/కనిష్టం
28.0/25.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. జిల్లాలోని కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): షెట్టర్ నిర్మాణాలను నెలరోజుల్లో పూర్తిచేయాలని ఎమ్మెల్యే విజయ రమణారావు సూచించారు. కాల్వశ్రీరాంపూర్ క్రాస్‌రోడ్డులో రూ.65 లక్షలతో చేపట్టిన షెట్టర్ నిర్మాణాలను ఆయన పరిశీలించి పలు సూచనలుచేశారు. చౌరస్తా సుందరీకరణకు అందరూ సహకరించాలని కోరారు. ఈసందర్భంగా నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ పుస్తక ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, నాయకులు దాన్నాయక దామోదర్‌రావు, గాజుల రాజమల్లు, అబ్బయ్యగౌడ్, చిలుక సతీశ్, శ్రీగిరి శ్రీనివాస్, కిశోర్, సత్యంగౌడ్, మొండయ్య, సతీశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### టీబీ రహిత గ్రామాలు లక్ష్యం



సూచనలిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్

ముత్తారం(మంథని): టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రాం జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. టీబీని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రంలో టీబీ నివారణ మందులు ఉచితంగా లభిస్తున్నాయని తెలిపారు. టీబీపై అవగాహన కల్పించాలని వైద్యుడు అమరేందర్‌రావు, వైద్య సిబ్బందికి ఆయన సూచించారు.

### 'హత్యాకాండ ఆపేయాలి '



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): అటవీసంపదను కాపాడుతున్న ఆదివాసీలను ఆపరేషన్ కగార్ పేరిట చంపవద్దని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, సమతా సైనిక దళ్ నాయకుడు దుర్గం నగేశ్ డిమాండ్ చేశారు. స్థానిక మేడిపల్లి సెంటర్‌లో ఆదివాసీ హక్కులు– కార్పొరేటీకరణ కగార్ హత్యాకాండ కాల్పుల విరమణపై ముద్రించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలనే డిమాండ్‌తో ఈనెల 24న హన్మకొండలో బహిరంగసభ నిర్వహిస్తామని తెలిపారు. రామటెంకి మల్లేశ్, జనగామ రాజన్న, చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, గూడూరు లవన్ కుమార్, మహేశ్, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నేడు టీబీజీకేఎస్ సమావేశం

గోదావరిఖని: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేంద్ర కార్యవర్గ సమావేశం బుధవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు అధికార ప్రతినిధి పర్లపల్లి రవి తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం, సంస్థ, ఉద్యోగుల భవిష్యత్‌పై చర్చించి పోరుబాటకు కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు.

### కొనసాగుతున్న కూల్చివేతలు



షాపులు కూల్చివేస్తున్న జేసీబీలు

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవనం ఎదుట గల పోచమ్మ మైదాన్‌లోని కట్టడాల కూల్చివేత మంగళవారం కూడా కొనసాగింది. తమ సామగ్రి షాపుల్లోనే ఉందని, కూల్చివేత ఆపాలని స్థానికులు ఆందోళనకు దిగారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులను పక్కకు తీసుకెళ్లారు. సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది కూడా పాల్గొంది. పోచమ్మ మైదానంలోని వివాదాస్పద 39 గుంటల సింగరేణి స్థలానికి సంబంధించి రెవెన్యూ అధికారులు సోమవారమే సర్వే చేశారు. నివేదికను కోర్టుకు సమర్పిస్తామని వెల్లడించారు.

### 22న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: మెడ్‌ప్లస్‌లో ఉద్యోగావకాశాల భర్తీకి ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఇన్‌చార్జి అధికారి తిరుపతిరావు తెలిపారు. 40 ఫార్మసిస్టు, 20 కస్టమ్ సేల్స్ అసోసియేట్, 30 స్టాక్ పికింగ్, ప్యాకింగ్, 30 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వివరాలకు 93923 10323, 89853 36947లో సంప్రదించాలని కోరారు.

# గౌరవంగా బతికేలా..

- రామగుండం నగరంలో స్మైల్ అమలుకు చర్యలు
- యాచకులను గుర్తించేందుకు అధికారుల సర్వే
- పునరావాస కల్పన.. సంక్షేమమే ధ్యేయం
- ట్రాన్స్‌జెండర్లపైనా బల్దియా ప్రత్యేక దృష్టి
- నిధులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం



యాచకుల వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, మెప్మా సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): యాచకులు లేనినగరంగా మార్చడానికి రామగుండం నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మైల్ పథకాన్ని అమలు చేయడానికి బల్దియాలో యాచకుల వివరాల సేకరణ కోసం సర్వే నిర్వహిస్తున్నారు. యాచక వృత్తి నిర్మూలించి, దానిపై ఆధారపడి బతుకుతున్న వారికి పునరావాసం కల్పించి.. వారి జీవితాల్లోనూ 'స్మైల్' నింపేందుకు ఈ పథకం దోహదం చేస్తుందని భావిస్తోంది.

**పునరావాసం.. సంక్షేమం..**

'సపోర్ట్ ఫర్ మార్జినలైజ్డ్ ఇండివిడ్యువల్స్ ఫర్ లైవ్లీవుడ్ అండ్ ఎంటర్‌ప్రైజ్'(స్మైల్) పేరిట కేంద్ర ప్రభుత్వం రెండు రకాల పథకాలను అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో ఒకటి.. ట్రాన్స్‌జెండర్ల పునరావాసం, సమగ్ర సంక్షేమం, రెండోది.. యాచకుల సమగ్ర పునరావాసం కల్పన ఉన్నాయి. యాచక వృత్తిని అవలంబిస్తున్న వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక, స్వచ్ఛంద, సామాజిక సంస్థల సహకారంతో సమాజంలో గౌరవం పొందేలా చర్యలు తీసుకోవడానికి స్మైల్‌కు శ్రీకారం చుడుతున్నారు.

**నిధులు కేటాయించిన కేంద్రప్రభుత్వం..**

స్మైల్ పథకాన్ని అమలు చేయడానికి సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కింద యాచకుల సంక్షేమానికి కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనిద్వారా వారి జీవనోపాధి, పునరావాస కల్పన, విద్య, ఆరోగ్యం, శిక్షణ గురించి అధికారులు తగిన చర్యలు తీసుకుంటారు. ఈ పథకం అమలు చేయడానికి రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన పలు మున్సిపల్ కార్పొరేషన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేశాయి. ఇందులో మన జిల్లాలోని నగరం రామగుండం బల్దియాను కూడా ఎంపిక చేశారు. స్మైల్ పథకం అమలుకు ఇటీవల రామగుండానికి రూ.9లక్షలు కేటాయించారు.

**యాచకుల వివరాల సేకరణ..**

స్మైల్‌లో భాగంగా సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు.. రామగుండంలో ప్రతీయాచకుడి పూర్తి వివరాలను మెప్మా ఆధ్వర్యంలో సేకరించే ప్రక్రియ చేపట్టారు. గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్, రామగుండంలోని రైల్వేస్టేషన్, నగరంలోని ఇతర ప్రధాన కూడళ్లు, దేవాలయాల ప్రాంతాల్లో ఉండే యాచకులను గుర్తించడానికి అధికారులు శరవేగంగా సర్వే కొనసాగిస్తున్నారు. సర్వేలో పొందుపర్చిన వివరాలను మెప్మా సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు.

**ఎన్జీవోకు నిర్వహణ బాధ్యతలు..**

నైట్‌షెల్టర్ల నిర్వహణ తరహాలోనే స్మైల్‌ను కూడా నిర్వహించడానికి ఎన్జీవోలకు బాధ్యతలు అప్పగించడానికి రామగుండం బల్దియా కమిషనర్ ఇటీవల నోఫికేషన్ విడుదల చేసిందని తెలిసింది. స్మైల్ నిర్వహణకు ఆసక్తి చూపిన రెండు ఎన్జీవోల నుంచి ఇప్పటికే బల్దియాకు అందిన దరఖాస్తుల్లో ఒక ఎన్జీవోనే ఎంపిక చేయడానికి బల్దియా అధికారులు జాబితాను కలెక్టర్ పరిశీలనకు పంపించారు.

### త్వరలోనే ప్రారంభిస్తాం



రామగుండం నగరంలో త్వరలోనే 'స్మైల్'ను అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం కేంద్రప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ.9లక్షలు మంజూరయ్యాయి. 'స్మైల్' నిర్వహణకు రెండు ఎన్జీవోల నుంచి అప్లికేషన్లు వచ్చాయి. ఇందులో ఒక ఎన్జీవోను ఎంపిక చేయడానికి కలెక్టర్‌కు నివేదించాం. రెండు, మూడు రోజుల్లో ఎన్జీవో ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

– అరుణశ్రీ, రామగుండం బల్దియా కమిషనర్(ఎఫ్‌ఏసీ)

# సరిపడా యూరియా ఉంది

- త్వరలోనే మరికొంత వస్తుంది
- మోతాదుకు మించి వినియోగించొద్దు
- ఇళ్లలో నిల్వచేస్తే ఆవిరవుతుంది
- 'సాక్షి'తో జిల్లా వ్యవసాయాధికారి బి.శ్రీనివాస్

సమస్యలుంటే
**99899 94617**
నంబరుకు కాల్‌చేయండి



పెద్దపల్లిరూరల్: వానాకాలం పంటల దిగుబడి పెంచుకునేందుకు ఎరువులు, పురుగు మందులను అవసరమైన మోతాదులోనే వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.శ్రీనివాస్ రైతులకు సూచించారు. ప్రస్తుత అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, అయితే, అవసరానికి మించి తీసుకెళ్లడంతోనే కొన్నిచోట్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మోతాదుకు మించి యూరియా చల్లితే వరి రంగుమారుతుందని తెలిపారు. ఈ విషయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సూచించారు. విదేశాల నుంచి యూరియా దిగుమతి అయ్యే అవకాశాలు మెరుగుపడడంతో రెండురోజుల్లోగా మరిన్ని నిల్వలు జిల్లాకు చేరే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

**జిల్లాలో వానాకాలం సాగు విస్తీర్ణం ఎంత?**

డీఏవో : అన్నిరకాల పంటలు కలిపి 2,65,990 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్నాయని అంచనా వేశాం. ఇప్పటివరకు 2,44,687 ఎకరాల విస్తీర్ణంలో సాగైంది. ఇందులో అత్యధికంగా వరి 1,92,260 ఎకరాల్లో సాగు కాగా, పత్తి 51,595 ఎకరాల్లో సాగు చేశారు.

**మోతాదుకు మించి యూరియా చల్లితే ఏమవుతుంది?**

డీఏవో : వరి పంటలో ఎకరానికి రెండు బస్తాలు నాలుగు దఫాలు, పత్తికి మూడు బస్తాలను చల్లాలి. ఆఖరి దఫాలో పొటాష్‌ను కలిపి చల్లాల్సి ఉంటుంది. ఎక్కువ చల్లితే ఆకురంగు మారి, పూత, కాత తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

**కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధర వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి?**

డీఏవో : యూరియా విక్రయాలు ఈ పాస్ ద్వారానే జరుగుతున్నాయి. వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్నాం. ఎరువులు, విత్తనాల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉన్నాయి. అయినా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

**యూరియా ఏమేరకు అవసరమని అంచనా వేశారు?**

డీఏవో : వానాకాలం సాగుకు 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేశాం. కానీ 21,581మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరింది. అందులో 18,991 మెట్రిక్ టన్నులను రైతులకు విక్రయించారు.

**ఒక్కొక్కరికి ఎన్ని యూరియా బస్తాలిస్తున్నారు?**

డీఏవో : ఎకరాకి రెండు బస్తాలు అవసరం. ప్రస్తుత నిల్వను బట్టి ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకం ఆధారంగా ఈపాస్‌మిషన్‌లో రైతు వివరాలు నమోదు చేసి ఎకరాకి ఒక బస్తా ఇస్తున్నాం. మళ్లీ 20 రోజుల తర్వాత ఇంకొక బస్తా అందిస్తాం.

**చిన్నరైతులకు యూరియా అందడం లేదంటున్నారు?**

డీఏవో : రైతులు తమ అవసరాలకు మించి తీసుకెళ్లి ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. ఇలా చేస్తే యూరియా ఆవిరై పోతుంది. వాస్తవంగా అవసరమయ్యే చిన్నరైతులకు యూరియా లభించకనే సమస్య ఉత్పన్నమవుతోంది. ఇంట్లో యూరియా నిల్వ ఉంటే అనారోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంది.

**యూరియా లేదని రైతులు ఆందోళన పడుతున్నారు?**

డీఏవో : జిల్లాలో ప్రస్తుతం 2,590 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. ఇది నాలుగైదు రోజుల వరకు సరిపోతుంది. ఈలోగా మరికొంత జిల్లాకు చేరేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం.

**సమస్యలు ఎదురైతే ఎవరిని సంప్రదించాలి?**

డీఏవో : యూరియా సంబంధిత సమస్యలు ఎదురైతే జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలోని 99899 94617 ఫోన్ నంబరులో సంప్రదించాలి.

# ఆగని ముసురువాన





రాఘవాపూర్ జెడ్పీ హైస్కూల్‌లోకి చేరిన వరదనీరు, గోదావరిఖనిలోని ఓసీపీలో నిలిచిన డంపర్లు

- జిల్లాకు జలకళ
- నిండుకుండల్లా చెరువులు
- ఉధృత'ధార'తో జలపాతం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి. మారెడుగొండ చెరువు మత్తడి దూకుతోంది. పెద్దబొంకూర్ వద్ద హుస్సేనిమియా వాగు ప్రవాహం పెరిగింది. రాగినేడు మత్తడి వద్ద చేపలు కొట్టుకుపోకుండా మత్స్యకారులు జాలీ ఏర్పాటు చేశారు. పెద్దకల్వల, భోజన్నచెరువు, చీకురాయి మల్లారెడ్డి చెరువు.. ఇలా జలవనరులన్నీ నిండుకుండల్లా మారుతున్నాయి. అదేవిధంగా సబ్బితం శివారులోని గౌరీగుండాలు జలపాతం ఉధృతమైన జలధారగా పోస్తోంది. రాఘవాపూర్ జెడ్పీ హైస్కూల్ ఆవరణ వరదనీటితో నిండి చెరువును తలపించింది. విద్యార్థులు మోకాలిలోతు నీటిలో బిక్కుబిక్కుమంటూ తరగతులకు వెళ్లాల్సి వచ్చింది. జిల్లాలో అత్యధికంగా అంతర్గాంలో 41.7 మి.మీ., అత్యల్పంగా సుల్తానాబాద్ మండలంలో 3.7 మి. మీ. వర్షపాతం నమోదైనట్లు ముఖ్యప్రణాళికశాఖ ఇన్‌చార్జి అధికారి రవీందర్ తెలిపారు.

**ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి**

గోదావరిఖని: రామగుండం రీజియన్‌లోని ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ, ఆర్జీ–2 ఏరియాలోని ఓసీపీ–3, ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1, 2లో హాలేజీ రోడ్లు జలమయం అయ్యాయి. బొగ్గు ఉత్పత్తితో పాటు ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి.

**మంగళవారం నమోదైన వర్షపాతం (మి.మీ.లలో)**

| ప్రాంతం | వర్షపాతం | పెద్దపల్లి | 18.1 |
|---|---|---|---|
| సరాసరి | 15.6 | జూలపల్లి | 10.2 |
| ధర్మారం | 21.3 | ఎలిగేడు | 7.7 |
| పాలకుర్తి | 25.9 | ఓదెల | 16.6 |
| రామగుండం | 10.0 | శ్రీరాంపూర్ | 11.7 |
| రామగిరి | 13.8 | ముత్తారం | 10.8 |
| కమాన్‌పూర్ | 13.4 | మంథని | 14.0 |

### గోదావరి వరదలపై కలెక్టర్ సమీక్ష

- రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పర్యటన
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

రామగుండం: ఎగువన ఉన్న శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో వరదనీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 35 గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించారు. వరద ఉధృతిపై అధికారులతో సమీక్షించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. పశువులు, గొర్రెలకాపరులు, మత్స్యకారులు నదిలోకి వెళ్లొద్దని అన్నారు. చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణ, డీఈ బుచ్చిబాబు, శరత్‌బాబు, తహసీల్దార్ ఈశ్వర్ పాల్గొన్నారు.

**ముంపు ప్రాంతాల పరిశీలన**

జ్యోతినగర్(రామగుండం): వరద ముంపు గ్రామాలైన మల్యాపూర్, రామయ్యపల్లెలో కలెక్టర్ పర్యటించారు. ముంపు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఈ సత్యనారాయణ, డీఈ బుచ్చిబాబు, శరత్‌బాబు, తహసీల్దార్ ఈశ్వర్, ఈఈ రామన్, డీసీసీ కార్యదర్శి ఎండీ రహీమ్ పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్లు కట్టిస్తాం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కల్యాణిలక్ష్మి చెక్కులు అందిస్తున్న మంత్రి లక్ష్మణ్

ధర్మారం(ధర్మపురి): స్థోమతలేని పేదలకు తానే దగ్గరుండి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ అభయం ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 23 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.23,26,006తోపాటు 121 మందికి సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించి రూ.41,63,500 విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైనవారందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రాజకీయ జన్మనిచ్చిన ధర్మారం మండలంలోని ప్రతీ పేదకు ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తానే తీసుకుంటానని భరోసా ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఒక్క రేషన్‌కార్డు కూడా అందించలేదని ఆరోపించారు. నాయకులు లావుడ్య రూప్లానాయక్, అరిగే లింగయ్య, కొడారి అంజయ్య, కొత్త నర్సింహులు, తిరుపతిరెడ్డి, అధికారులు ఉన్నారు.

# కాసులు కురిపిస్తున్న బొగ్గు

- ఓవర్ బర్డెన్ గుట్టల నుంచి సేకరణ
- ఇటుక బట్టీలు.. హోటల్‌లకు తరలింపు
- అర్ధరాత్రి అక్రమంగా రవాణా చేస్తున్న మాఫియా
- ప్రభావిత గ్రామాలే కేంద్రంగా జోరుగా వ్యాపారం



అక్కెపల్లిలోని ఓ పాత ఇంట్లో నిల్వచేసిన బొగ్గు



ఓ ఇంటి ఎదుట బొగ్గు నిల్వలు

మంథనిరూరల్: సింగరేణి ప్రభావిత గ్రామాల్లో ఏ ఇంటి ముందు, వెనుక చూసినా బొగ్గు కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఈ దృశ్యం ఆ ఊళ్లలో సహజమే అయినా.. కొందరు దళారులు అక్రమ మార్గంలో తరలిస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. తొలుత రాత్రి, తెల్లవారుజామున సమీపంలోని ఓవర్ బర్డెన్(ఓబీ – మట్టి) కుప్పల నుంచి బొగ్గు సేకరిస్తూ గ్రామాల్లో నిల్వ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తున్నా.. కొందరికి కాసులు కురిపిస్తోంది. సింగరేణి ప్రభావిత గ్రామాలుగా గుర్తించడంతో అభివృద్ధి పనులు, ప్రభుత్వపరంగా అందే ఉపాధి అవకాశాలు కోల్పోవడంతో గత్యంతరం లేక కొందరు బొగ్గు సేకరణను ఉపాధిగా మార్చుకుంటున్నారు. ప్రధానంగా ఇది మంథని మండలంలోని సింగరేణి ప్రభావిత అక్కెపల్లి, సిద్దపల్లి తదితర గ్రామాల్లో జోరుగా సాగుతోంది.

**ఓబీ కుప్పల నుంచి సేకరణ..**

సింగరేణి బొగ్గు గనుల సంస్థ తమ అవసరాలు, ఓసీపీల విస్తరణ కోసం అక్కెపల్లి, సిద్దపల్లి గ్రామాలను స్వాధీనం చేసుకుంది. ఈక్రమంలో ఓసీపీలో బొగ్గు తీసేందుకు పైపొరలోని మట్టిని తవ్వితీస్తోంది. ఈ మట్టిని ప్రభావిత గ్రామాల సమీపంలోనే కుప్పలుగా పోస్తోంది. ఈ మట్టిలో కలిసిఉన్న బొగ్గును స్థానికులు సేకరించి నిల్వ చేస్తున్నారు. ఇలా కొన్నేళ్లుగా బొగ్గు సేకరణతో వారు ఉపాధి పొందుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని సింగరేణి అధికారులు తరచూ హెచ్చరించినా కొందరిలో మార్పురావడం లేదు.

**హోటళ్లు, ఇటుక బట్టీలకు విక్రయాలు..**

ఓబీ కుప్పల నుంచి సేకరించిన బొగ్గును ఒకచోట నిల్వ చేశాక.. కొందరు బొగ్గు నిల్వలను ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇటుక బట్టీలు, ఇతర ప్రాంతాల్లోని హోటళ్లకు అక్రమంగా తరలిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు సింగరేణి బొగ్గును పొయ్యిలలో వినియోగిస్తుండడంతో డిమాండ్ పెరిగింది.

**దళారుల ఎంట్రీతో..**

ప్రభావిత గ్రామాల్లోని కొందరి ఉపాధిని ఆసరాగా చేసుకుంటున్న దళారులు బొగ్గును అక్రమ మార్గంలో తరలించేందుకు తెరలేపారు. తక్కువ ధరకు స్థానికుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**బస్తాకు రూ.70 నుంచి రూ.100 ధర**

సిమెంట్ బ్యాగ్‌లో నింపిన బొగ్గు ఒక బస్తా రూ.70 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది. ఒకవ్యక్తి రోజూ మూడు నుంచి ఐదు బస్తాల్లో బొగ్గు సేకరిస్తూ నిల్వచేస్తున్నాడు. ఇలా సేకరించిన బొగ్గును సింగరేణి ఏరియాల్లో స్థానికులు వంటలు తయారు చేసేందుకు ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో కొందరు సమీపంలోని సింగరేణి ప్రాంతాల్లో రహస్యంగా బొగ్గు అమ్ముకుంటున్నారు.

### పట్టుకుంటున్నాం

సింగరేణి ప్రభావిత గ్రామాల్లో తరచూ దాడులు చేస్తూ అక్రమంగా నిల్వ చేసిన బొగ్గు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అలాగే యాంటీ కోల్ తెఫ్ట్ టీం సైతం దాడులు చేస్తోంది. బొగ్గు అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకుంటోంది.

– షబ్బీర్, సెక్యూరిటీ ఆఫీసర్, ఆర్జీ– 3 ఏరియా

## ఆనకట్ట కట్టలేదు.. నీళ్లు ఆపుతలేరు



బరాజ్ నీటిని పరిశీలిస్తున్న పుట్ట మధూకర్

మంథనిరూరల్: నాడు గోదావరి నదిపై ఆనకట్టలు కట్టాలని, ఇప్పుడు వృథాగాపోతున్న వరదనీటిని ఆపాలని మంథని ఎమ్మెల్యే ఏనాడూ ఆలోచన చేయలేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. గోదావరి విలాపం పేరిట మంగళవారం సిరిపురం సమీపంలోని పార్వతీ బరాజ్‌ను సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరంపై సీఎం రేవంత్ రెడ్డి విషం చిమ్ముతున్నారని, మంథని ఎమ్మెల్యే అడుగులకు మడుగులొత్తుతున్నారని దుయ్యబట్టారు. మేడిగడ్డ బరాజ్ దెబ్బతింటే లోపంలేని పార్వతీ బరాజ్ గేట్లు ఎత్తి నీటిని ఎందుకు దిగువకు వదులుతున్నారో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. వెంటనే గేట్లు మూసి నీళ్ల ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు ఏగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్‌లాల్, గుజ్జుల రాజిరెడ్డి, ఆరెపల్లి కుమార్, కనవేన శ్రీనివాస్, కొండా రవీందర్, మిర్యాల ప్రసాదరావు పాల్గొన్నారు.



దిగువకు వెళ్తున్న వరద నీరు

## గోదావరి ఉరకలు

రామగుండం: ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో తరలివచ్చే వరదనీటితో గోదావరి నది ఉరకలేస్తోంది. ఈ నేపథ్యంలోనే రామగుండం సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం 35 గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరి నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.185 టీఎంసీలు నిల్వ ఉంది. శ్రీరాంసాగర్ నుంచి 2,02,998, కడెం నుంచి 7,580, వరద 1,03,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. హైరాబాద్‌కు 275 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంపుహౌస్‌కు 3,150 క్యూసెక్కులు తరలిస్తున్నారు.



## అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి.. కోనేరులో స్నానాలు చేశారు. క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. సామూహిక ఆంజనేయస్వామి అభిషేకాల్లో పాల్గొన్నారు. లడ్డూ, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.6లక్షలు, ప్రత్యేక దర్శనం టికెట్ల విక్రయాల ద్వారా రూ.4.12 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీకాంత్ రావు, చంద్రశేఖర్, సునీల్‌కుమార్, హరిహరనాథ్, అశోక్, తదితరులు పర్యవేక్షించారు.



## శరణు శరణు రాజన్న



వేములవాడ: శ్రావణమాసం చివరిదశకు చేరుకుంటుండడంతో మంగళవారం సైతం రాజన్నకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, అమ్మవారికి కుంకుమపూజ మొక్కులు చెల్లించుకున్నారు.

# ఎస్జీఎఫ్ క్రీడలకు వేళాయె..

- షెడ్యూల్ ఖరారు చేసే పనిలో కార్యదర్శులు
- చివరి వారంలో ప్రారంభం కానున్న మండలస్థాయి పోటీలు
- సన్నద్ధమవుతున్న విద్యార్థులు



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు(ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాల్లో క్రీడల సందడి నెలకొననుంది. 2025–26 విద్యాసంవత్సరం ఆరంభమైంది. ఈ విద్యాసంవత్సరంలో జరగనున్న పాఠశాలలు, కళాశాలల క్రీడా సమాఖ్యల క్రీడాపోటీలు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీంతో రానున్న 2 నెలలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలతో ఆయా మైదానాలు కిక్కిరిసిపోనున్నాయి. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతీ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలస్థాయిలో అండర్–14, 17, కళాశాల స్థాయిలో అండర్–19 విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా మండలస్థాయి నుంచి మొదలుకొని జిల్లా, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు చివరి వారం నుంచి క్రీడాసందడి మొదలు కానుంది.

**కబడ్డీ, ఖోఖో, వాలీబాల్..**

పాఠశాలస్థాయిలో అండర్–14, 17 విభాగాలకు మండల, జిల్లా, జోనల్(ఉమ్మడి జిల్లా) స్థాయిల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో చివరి వారం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్, ఎంపిక నిర్వహిస్తారు. సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లాస్థాయి, మూడో వారంలో ఉమ్మడి జిల్లా(జోనల్) స్థాయిలో టోర్నమెంట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన జట్లు అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో పాల్గొననున్నాయి.

**డీఈవోలతో సమావేశం**

2025–26 సంవత్సరానికి 69వ ఎస్జీఎఫ్ క్రీడలకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో ఎస్జీఎఫ్ బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించారు. పోటీల నిర్వహణ, భోజన సౌకర్యం, ఎస్జీఎఫ్ కార్యదర్శుల నియామకం తదితర వాటిపై చర్చించారు. మండల , జిల్లా, ఉమ్మడి జిల్లా పోటీలను ఏవిధంగా నిర్వహించాలి.. పోటీలను ఏఏ తేదీల్లో నిర్వహించాలి.. వర్షం కురుస్తున్న సందర్భంగా పోటీల నిర్వహణ ఏవిధంగా చేయాలని తదితర వాటిపై చర్చించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్జీఎఫ్ పోటీలకు సంబంధించిన తేదీలు ఖరారు కానున్నట్లు పలువురు పీఈటీలు తెలిపారు.

**సన్నద్ధమవుతున్న విద్యార్థులు**

ఎస్జీఎఫ్ క్రీడల్లో సత్తా చాటేందుకు ఆయా జిల్లాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించి పతకాలు సాధించి జిల్లా, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చేందుకు సాధన చేస్తున్నామంటున్నారు. గత సంవత్సరం కంటే మెరుగైన ఆటతీరును కనబరిచేలా కసరత్తు చేస్తున్నామని, రాష్ట్ర పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్ల గెలుపే ధ్యేయంగా సాధన చేస్తున్నామని, పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటామని పలువురు చిన్నారులు చెబుతున్నారు.

### ప్రతిభ చాటాలి



పాఠశాలస్థాయిలో విద్యార్థులకు క్రీడావేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు ఎంతగానో దోహదపడుతున్నాయి. రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలి. ప్రతీ ఏడాది ఉమ్మడి జిల్లా విద్యార్థులు జాతీయస్థాయి ఎస్జీఎఫ్ టోర్నీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారు. ఈ సంవత్సరం మరింత మెరుగ్గా రాణించి పతకాలు తీసుకురావాలి.

– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి

### ఘనంగా నిర్వహిస్తాం



జిల్లాలో అండర్–19 విభాగంలో కళాశాలల క్రీడలను ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాం. పలు క్రీడల్లో కూడా రాష్ట్ర పోటీలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నాం. గత సంవత్సరం ఆర్చరీతోపాటు పలు క్రీడల్లో రాష్ట్ర పోటీలను ఘనంగా నిర్వహించాం. ఈ సంవత్సరం కూడా అందరి సహకారంతో పోటీలను విజయవంతం చేస్తాం.

– మధు జాన్సన్, కళాశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి, కరీంనగర్

### ఏర్పాట్లు చేస్తున్నాం



మండలస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పోటీలను అందరి సహకారంతో పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఎస్జీఎఫ్ కార్యదర్శులు, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పోటీలను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– వేల్పుల సురేందర్, పెటా అధ్యక్షుడు, పెద్దపల్లి

### సహకారమందిస్తాం



జిల్లాలో ఎస్జీఎఫ్ క్రీడలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పోటీలను ఘనంగా నిర్వహించాలి. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి. ఎస్జీఎఫ్ క్రీడాపోటీలకు జిల్లా క్రీడాశాఖ సహాయ సహకారాలు కూడా అందిస్తాం. చిన్నారులు ఎస్జీఎఫ్ క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలి.

– వి.శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

### జాతీయస్థాయిలో ఆడాలని ఉంది



బేస్‌బాల్ క్రీడలో గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో ఆడాను. ఈ సంవత్సరం జాతీయస్థాయిలో ఆడాలని ఉంది. రోజు ప్రాక్టీస్ చేస్తున్నా. జూడోలో కూడా సాధన చేస్తున్నా. ఇంకా పోటీల తేదీలు ఖరారు కాలేదు. ఈసారి ఎలాగైనా జాతీయస్థాయికి ఆడుతా.

– కృషాంక్

## క్లుప్తంగా

### వేధింపులతో హమాలీ ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్‌రూరల్: వడ్డీ వ్యాపారుల వేధింపులతో ఓ హమాలీ కార్మికుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి కథనం మేరకు బొమ్మకల్ పరిధిలోని కృష్ణానగర్‌కు చెందిన తంగెళ్ల శ్రీనివాస్(44) గ్రామంలోని చింతపండు నాగరాజు వద్ద రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నాడు. పలు విడతల్లో రూ.15 లక్షల వరకు చెల్లించాడు. ఇంకా రూ.27.60లక్షలు ఇస్తేనే అప్పు ముట్టుతుందంటూ శ్రీనివాస్‌కు లాయర్ నోటీసులు పంపించాడు. శ్రీనివాస్ తన వద్ద డబ్బులు లేవని చెప్పగా, భూమిని రిజిస్ట్రేషన్ చేయాలంటూ నాగరాజు తోపాటు మరో వ్యక్తి బట్టు రాజేందర్ వేధింపులకు గురిచేశారు. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్ సోమవారం రాత్రి 10గంటలకు ఇంటి వెనక ఉన్న మామిడిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కొడుకు హర్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

### గుంపులలో ఉరివేసుకొని వ్యక్తి..



ఉరగొండ లక్ష్మణ్(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): గుంపుల గ్రామానికి చెందిన ఉరగొండ లక్ష్మణ్(40) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇంట్లోని ఓ గదిలో పడుకున్న లక్ష్మణ్‌ను భోజనం చేయాలని కోరుతూ తల్లి మధునమ్మ మంగళవారం ఉదయం పిలిచింది. అతడు ఎంతకూ గదిలోంచి బయటకు రాకపోయే సరికి కిటికీలోంచి చూసింది. దీంతో ఉరివేసుకొని మృతిచెంది కనిపించాడు. ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉన్న లక్ష్మణ్ రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. అనారోగ్యానికి గురయ్యాడు. భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. కొంతకాలంగా ఒంటరి జీవితం గడుపుతున్న లక్ష్మణ్.. మద్యానికి బానిసై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### బావిలో దూకి యువకుడు..



శివకుమార్ (ఫైల్)

జమ్మికుంట: తరచూ తాగి వస్తున్న కొడుకును తల్లి మందలించడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన హమాలీ శివకుమార్(25) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగివస్తుండడంతో తల్లి మందలించింది. కోపంతో సోమవారం ఉదయం ఇంటినుంచి వెళ్లి కొత్తపల్లి సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లి లత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పరిధిలోని ఒడ్డెపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతన్‌పల్లికి చెందిన జడ బక్కవ్వ(80) మృతి చెందింది. కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో బిల్లా కోటేశ్వర్ వివరాల ప్రకారం.. బక్కవ్వ మనుమరాలు జడ మౌనిక అనారోగ్యంతో బాధపడుతోంది. కొత్తపల్లి మండలం బావుపేటలో తాయత్తు కట్టించుకునేందుకు ఆటోలో వెళ్తుండగా ఒడ్డెపల్లి వద్ద ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. బక్కవ్వ, మౌనిక, ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా బక్కవ్వ మృతి చెందింది. తల్లి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని జడ రాయమల్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

### అమ్మవారికి చేనేత కళాకారుడి ప్రత్యేక చీర



అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీరను ఈవోకు ఇస్తున్న విజయ్

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సిరిసిల్ల సాయినగర్‌కు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు చీరను నేసి మంగళవారం ఈవో రాధాబాయికి సమర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌ని ఈవో సత్కరించారు. అలాగే దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ జన్మదినం సందర్భంగా ఆలయంలో ఈవో ప్రత్యేక పూజలు చేశారు.

**నేడు హుండీ లెక్కింపు**

వేములవాడ రాజన్న హుండీలలోని కట్నాలు, కానుకలను బుధవారం ఉదయం 8 గంటల నుంచి స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో పేర్కొన్నారు. ఆలయ ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి (50) వర్షంలో తడుస్తూ వణుకుతుండగా, వన్‌టౌన్ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 10.30 గంటలకు మృతి చెందాడు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ రామచంద్రరావు తెలిపారు.

## రాజన్న సేవలో మాజీ సీఎం కేసీఆర్ సతీమణి



కేసీఆర్ సతీమణి శోభ, మనువడు హిమాన్షుకు రాజన్న చిత్రపటం అందజేస్తున్న లక్ష్మీనరసింహారావు

వేములవాడ: రాజన్నను మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ, మనువడు హిమాన్షు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదం అందజేశారు.

### వలకు చిక్కి కొండచిలువ మృతి



మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట పెద్దచెరువులో అలుగుకు కట్టిన వలలో పెద్ద కొండచిలువ చిక్కుకుని మృతి చెందింది. దీంతో మత్స్యకారులు వలలోంచి 15 అడుగుల కొండ చిలువను బయటకి తీశారు. భారీ వర్షాలకు చెరువులోకి వరదచేరినపుడు కొండచిలువలు వస్తుంటాయని మత్స్యకారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## గల్లంతైన ఇద్దరు మహిళలు శవాలుగా..

- మరో మహిళ కోసం గాలింపు



అఫ్రిన (ఫైల్)




హసీన (ఫైల్)

జగిత్యాలక్రైం: మహారాష్ట్రలో జరిగిన ఓ వివాహ వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో కారులో ప్రయాణిస్తున్న జగిత్యాల శివారు టీఆర్‌నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఆదివారం గల్లంతయిన విషయం తెల్సిందే. మంగళవారం ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యమయ్యాయి. షేక్ అఫ్రిన (30), సమీన (50), హసీన (28)తోపాటు వారి బంధువు, ఆర్మూర్‌కు చెందిన సోహెబ్ కలిసి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముక్హేడ్ తాలూకా దెగ్లూర్ వెళ్లి తిరిగి వస్తుండగా రవిగాం వద్ద వరదలో గల్లంతయ్యారు. భారీ వరదల్లో కారు కొట్టుకుపోయింది. అక్కడి గ్రామస్తులతో పాటు, రెస్క్యూ టీం, పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టగా హసీన, అఫ్రిన్ మృతదేహాలు దొరికాయి. సమీన మృతదేహం కోసం గాలిస్తున్నారు. మృతదేహాలను అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తీసుకురానున్నారు.

## ఎంసీ శేఖర్‌కు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ అవార్డులు



అవార్డులకు ఎంపికైన గిరిజనుల జీవన శైలి ఫొటో



బంగారు పతకం సాధించిన గోల్కొండ కోట ఫొటో



చంద్రశేఖర్

సిరిసిల్ల: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 2025 సంవత్సరానికి రెండు అంతర్జాతీయ అవార్డులను రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్ (మేర్గు చంద్రశేఖర్) సాధించాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ డీ లా ఆర్ట్ అఫ్ ఫొటోగ్రఫీ (ఎఫ్ఐఏపీ) ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ(ఎఫ్ఐపీ)సంస్థలతో కలిపి ఇండోర్ కు చెందిన 'మాల్వా ఫొటోగ్రఫీ' సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫొటోగ్రఫీ పోటీల్లో ఎంసీ శేఖర్ హైదరాబాద్ గోల్కొండ కోటలో తీసిన 'ఫోర్ట్ గేట్' ఫొటోకు బంగారు పతకం వరించింది. ఇదే పోటీలో తెలంగాణకు చెందిన మథుర లంబాడాల జీవనశైలిపై తీసిన 'చిట్ చాట్' చిత్రానికి ఫ్రాన్స్‌కు చెందిన 'ఫియాప్' (ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ లా ఆర్ట్ ఫొటోగ్రఫీ, ఫ్రాన్స్) సంస్థ 'హనరెబుల్ మెన్షన్' అవార్డు ప్రకటించింది. ఇప్పటికే అనేక అంతర్జాతీయ అవార్డులు, పలు దేశాల గౌరవ పురస్కారాలు పొందిన శేఖర్ మూడున్నర దశాబ్దాలుగా సిగ్మా ఫొటో గ్రఫీ సంస్థ ద్వారా రాణిస్తున్నారు. తాజా మరో రెండు అవార్డులు సాధించిన చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు.

# పుట్టినరోజునే నూరేళ్లు

- సిరిసిల్ల యువకుడి విషాదాంతం
- వినాయక విగ్రహం తెస్తూ విద్యుదాఘాతంతో మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

సిరిసిల్లటౌన్: పుట్టినరోజున ఇంట్లో అమ్మ ఆశీస్సులు పొంది, దోస్తులతో ఆనందంగా గడుపొచ్చన్న యువకుడిని విద్యుత్ తీగల రూపంలో మృత్యువు కబళించింది. స్థానికులు తెలిపిన వివరాలు..తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌కు చెందిన కొమ్ము మైసయ్య–నవీన దంపతులు సిరిసిల్ల నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్నారు. మైసయ్య ఉపాధి కోసం గల్ఫ్‌లో ఉండగా..భార్య నవీన ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి లక్ష్మీనారాయణ ఉరఫ్ లక్కీ (20), నిఖిల్, శ్వేత సంతానం. కొద్దిరోజులు హైదరాబాద్‌లో పనిచేసిన లక్ష్మీనారాయణ ఇటీవలే సిరిసిల్లకు వచ్చి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు గణేశ్ ప్రతిమను తీసుకురావడానికి లక్ష్మీనారాయణ సోమవారం ఫ్రెండ్స్‌తో ఆర్మూర్ వెళ్లాడు.

**పుట్టినరోజే కానరాని లోకాలకు..**

మంగళవారం తన పుట్టినరోజు కావడంతో దోస్తులతో కలిసి అప్పటికే ఆర్డర్ ఇచ్చిన 15 అడుగుల వినాయక ప్రతిమను తీసుకొచ్చి వేడుకలు జరుపుకోవాలని లక్కీ, ఫ్రెండ్స్ నిశ్చయించుకున్నారు. సోమవారం రాత్రి వర్షంలో ఇబ్బందులు ఎందుకని ఫ్రెండ్స్ అందరూ ఆర్మూర్‌లోనే పడుకున్నారు. మంగళవారం ఉదయం సిరిసిల్లకు వినాయక విగ్రహంతో ప్రయాణమయ్యారు. కామారెడ్డి జిల్లా ఆరెపల్లి గ్రామ స్టేజీ వద్ద హైటెన్షన్ కరెంటు తీగలకు గణపతి విగ్రహానికి అమర్చిన ఇనుప పైపులు తగిలి లక్ష్మీనారాయణ, సాయి అనే ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే షాక్‌తో పడిపోయారు. స్నేహితులు, స్థానికులు వెంటనే వారికి సీపీఆర్ చేయగా, సాయి మెలకువలోకి రాగా, లక్ష్మీనారాయణ అలానే పడిపోయాడు. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మరో గంట సమయం గడిస్తే సిరిసిల్లకు చేరేవారు. కాగా, లక్కీ, సాయిలకు కాళ్లకు చెప్పులు లేకపోవడంతో షాకు తగిలినట్లు ఫ్రెండ్స్ చర్చించుకుంటున్నారు. పుట్టినరోజునే లక్కీ జీవితం విషాదాంతంగా ముగియడం సిరిసిల్లలో తీరని విషాదం నింపింది.



రోదిస్తున్న లక్కీ కుటుంబ సభ్యులు

## టెక్స్‌టైల్ పార్కు కార్మికుల మెరుపు సమ్మె



టెక్స్‌టైల్ పార్కులో ర్యాలీ తీస్తున్న పవర్లూమ్ కార్మికులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పవర్లూమ్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్కులో వస్త్రోత్పత్తి నిలిచిపోయింది. తమ కూలి రేట్లను పెంచాలని కోరుతూ కార్మికులు మంగళవారం మెరుపు సమ్మెకు దిగినట్లు సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు రోజూ రూ.1,000 వేతనం చెల్లించేలా కూలి రేట్లను సవరించాలన్నారు. అలాగే ఒప్పంద గడువు ముగిసన ప్రైవేటు వస్త్రానికి 10 పిక్కులకు రూ.50 పైసలు పెంచాలన్నారు. యజమానులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్కు పవర్లూమ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు వస్త్రాలకు సంబంధించి యజమానులు కూలి పెంచే వరకు కార్మికులు ఎవరూ పనులకు వెళ్లకూడదని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం గేటు వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మిక నాయకులు సదానందం, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.